## సీఎం సహాయ నిధి పేదలకు వరం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

సీఎం సహాయనిధి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, ఏప్రిల్ 30 : ఆపదలో ఉన్న నిరు పేదలకు సీఎం సహాయ నిధి వరమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పట్టణంలోని 27వ వార్డుకు చెందిన పగడాల ఇందిరమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 27వ వార్డు ఇన్‌చార్జి గొట్టిముక్కుల లక్ష్మణ్, నాయకులు చిలుకూరు బాలు, దేశిడి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పెరుగుతున్న మూసీ ప్రాజెక్ట్ నీటి మట్టం

మూసీ రిజర్వాయర్‌లో చేరిన నీరు

కేతేపల్లి, ఏప్రిల్ 30 : మూసీ ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. మూసీ పరివాహక ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌లో అకాల వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. బుధవారం ప్రాజెక్టులోకి 383.09 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. గత నెలలో ప్రాజెక్టు నీటిమట్టం 622.91 అడుగులుగా ఉండగా అడపా, దడపా కురిసిన వర్షాలకు నెల రోజుల్లోనే సుమారు 9 అడుగుల మేర నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు(4.46 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 631.05 అడుగులు (1.54 టీఎంసీలు) ఉంది.

## బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన

ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ్రిత సంస్థ సభ్యులు, స్థానికులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 30 : బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం మండల కేంద్రంలో ఆశ్రిత సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2006 బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని, మైనర్లకు పెండ్లిండ్లు చేస్తే శిక్షార్హులు అవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు వాజిద్ అలీ, అర్చకుడు భగవాన్ శర్మ, పాస్టర్ జయరాజ్, మనం స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ దైద నాగరాజు, స్థానికులు సర్వర్, అరుణజ్యోతి, అశ్విని త, శోభారాణి, రమేశ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుడికి నివాళి

యాదగిరిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శాలిగౌరారం, ఏప్రిల్ 30: స్వాతంత్ర్య సమరయోధుడు, శాలిగౌరారం పంచాయతీ మాజీ సర్పంచ్ చామల యాదగిరిరెడ్డి 7వ వర్ధంతిని బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, చామల వెంకటరమణారెడ్డి, జయపాల్‌రెడ్డి, నోముల జనార్దన్, బొల్లికొండ గణేశ్, బొడ్డు సోమలింగయ్య, పుల్లూరి దేవేందర్, ఆకుల శ్రీను, కడారి అంజయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : తాసీల్దార్

నిడమనూరు, ఏప్రిల్ 30 : దళిత, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తాసీల్దార్ జంగాల కృష్ణయ్య అన్నారు. మండలంలోని ఇండ్లకోటయ్యగూడెంలో బుధవారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో దళిత వాడలో మౌలిక వసతుల కల్పన, కుల వివక్ష పై అడిగి తెలుసుకున్నారు. రాజ్యాంగ వచ్చిన హక్కులను దళితులు వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఐ ఉప్పు సురేశ్, గిర్ధావర్ సందీప్, జేపీఓ హనుమా పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

నార్కటపల్లి : గ్రామీణ ప్రాంతాల ప్రజలు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తాసీల్దార్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని మాండ్ర గ్రామంలోని దళిత కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని అంటరానితనం, బాల్య వివాహాలు, కుల వివక్షత, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ తరుణ్, అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం, ఏప్రిల్ 30: వేస తీవ్రత అధికంగా ఉండడంతో వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులకు బుధవారం బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి వచ్చే వారి దాహార్తి తీర్చేందుకు మండల కేంద్రంలో నెల రోజుల నుంచి చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వారంలో రెండు రోజులు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

### వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ..

మిర్యాలగూడ టౌన్ : వాసవి వనిత, కుసుమాంబ క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం అక్షయతృతీయను పురస్కరించుకొని పట్టణంలోని రైతుబజార్ వద్ద మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిల్వర్‌స్టార్ రాయపూడి భవానీఉమాశేఖర్, వాసవి వనిత ప్రెసిడెంట్ తల్లం పుష్పవతీఅశోక్, కుసుమాంబ క్లబ్ సెక్రటరీ అనూషాశ్రీధర్, లావణ్య, హారిక, భవానీ పాల్గొన్నారు.

**ప్రకటన**

నా క్లయింట్ గంగాదేవి గిరి, తండ్రి: రాములు, వయస్సు:43 సం., వృత్తి వ్యాపారము, నివాసం ఇంటి నెం.3-532/5C కుంట్లగూడెం గ్రామము, చౌటుప్పల్ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా గారు ఇచ్చు ప్రకటన ఏమనగా నా యొక్క ఇంటి యొక్క దాన దస్తావేజు నం.387/2012, తేది:25-01-2012, SRO- Choutuppal ద్వారా పొందియున్నాను, దానియొక్క ఒరిజినల్ లింక్ విక్రయ దస్తావేజు నెం.2326/2009, Dated: 17-04-2009 & 3447/2009, dated: 20-06-2009, SRO-Choutuppal, నేను నల్లగొండలో ప్రకాశం బజార్ నుండి క్లాక్‌టవర్‌కి వెలుచుండగా మార్గమధ్యలో పోయినది కావున ఇట్టి విషయముపై పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చినాము, సదరు ఆస్తి యొక్క వివరములు ఇంటి నెం.3-532/5C ప్లాట్ నెం.68/C and 69/C సర్వే నెం.309/A విస్తీర్ణం 72.00 చదరపు గజాలు 60.19 చదరపు మీటర్లు బ్లాక్ నం.3, మారుతి నగర్, ముత్యాలమ్మ గుడి, చౌటుప్పల్ గ్రామము మరియు మండలం, యాదాద్రి భువనగిరి జిల్లాసదరు ఆస్తి యొక్క హద్దులు ఉత్తరం: ల్యాండ్ ఆఫ్ బువమ్మ, దక్షిణం: 25 ఫీట్ల రోడ్, తూర్పు: ఇతరుల ఇల్లు, పడమర: 25 ఫీట్ల రోడ్, ఎవ్వరికైనను పై దస్తావేజు దొరికినచో నా క్లాంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరమునచో తగిన ఆదారములతో (5) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

సం/- నాంపల్లి చంద్రశేఖర్
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ-508001, తెలంగాణ,
సెల్: 9440422393
నల్లగొండ
తేది:30-04-2025

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

గోరెంకలపల్లిలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్/నల్లగొండ రూరల్, ఏప్రిల్ 30 : అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం నకిరేకల్ మండలంలోని గోరెంకలపల్లి, నల్లగొండ మండలంలోని ఆర్జాల బావి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతాన్ని, తాలు, చెత్తను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఎండబెట్టుకొని, శుభ్రం చేసుకొని తీసుకు రావాలని సూచించారు. ఒక వేళ వర్షం వస్తే ధాన్యంపై కప్పడానికి వీలుగా ముందస్తుగా రైతులకు అవసరమైన టార్పాలిన్లు సేకరించుకొని ఉంచుకోవాలన్నారు. ధాన్యం సేకరణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ హరీశ్, డీసీఓ పాత్యానాయక్, తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, సెంటర్ ఇన్‌చార్జి శీలం నాగరాజు, పీఏసీఎస్ సీఈఓ అనంతరెడ్డి, చైర్మన్ నాగరత్నం రాజు ఉన్నారు.

## జిల్లా గ్రామీణాబివృద్ధి జాయింట్ డైరెక్టర్‌గా శేఖర్‌రెడ్డి

శేఖర్‌రెడ్డి

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 30: నల్లగొండ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వై.శేఖర్‌రెడ్డి కి పదోన్నతి లభించింది. ప్రస్తుతం డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న శేఖర్‌రెడ్డికి జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## నల్లగొండ తాసీల్దార్‌గా హరిబాబు

తాసీల్దార్ హరిబాబు

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 30: నల్లగొండ తాసీల్దార్‌గా ఎన్.హరిబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు నల్లగొండ తాసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ బదిలీ కాగా ఆయన స్థానంలో మిర్యాలగూడలో పని చేస్తున్న హరిబాబును బదిలీ చేశారు. ఆయనకు డిప్యూటీ తాసీల్దార్ తబిత, ఆర్ఐ గౌస్ అలీ, ఏఆర్ఐ మహ్మద్ అక్తర్ అలీ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## నేటి నుంచి ఎంజీయూ పరిధిలో కళాశాలలకు వేసవి సెలవులు

రామగిరి, ఏప్రిల్ 30: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలతోపాటు అనుబంధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పీజీ, ఎంఈడీ, బీఈడీ కళాశాలలకు మే 1 నుంచి 31 వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలు తిరిగి జూన్ 2న ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్ వీటిని విధిగా పాటించాలని ఆదేశించారు.

## తిప్పర్తి కేజీబీవీలో బాలికలకు ఉచిత వేసవి శిక్షణ

రామగిరి, ఏప్రిల్ 30: బాలికలకు ఉచిత వేసవి శిక్షణ నిర్వహిస్తున్నట్లు డీఈఓ బి.భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్రశిక్ష తెలంగాణ రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాలతో మే 5 నుంచి 20 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కేజీబీవీ తిప్పర్తి పాఠశాలలో బాలికలకు ఉచిత వసతితో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో పెయింటింగ్, డ్యాన్స్, మ్యూజిక్, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిశ్, యోగా, స్పీడ్ మ్యాథ్స్, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థినులు మే 4లోగా శిక్షణ శిబిరంలో పేర్లు నమోదు చేసుకోవాలని, 9392967610, 9963942839ను సంప్రదించాలని సూచించారు.

## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

శాలిగౌరారం, ఏప్రిల్ 30 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దాంతో పలు గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసింది. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కాంటా వేసి బస్తాల్లో నింపి మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం తడిసింది. వరదకు ధాన్యం రాసుల్లో నీరు చేరి ధాన్యం కొట్టుకు పోయినట్లు రైతులు తెలిపారు.

నూతన వసతి గృహ సంక్షేమ అధికారులను సన్మానిస్తున్న టీఎన్‌జీఓ నాయకులు

## వసతి గృహ సంక్షేమ అధికారులకు టీఎన్‌జీఓ సన్మానం

రామగిరి, ఏప్రిల్ 30: కొత్తగా ఎంపికైన ఎస్సీ, ఎస్టీ శాఖల గ్రేడ్ -1, 2 వసతి గృహాల సంక్షేమ అధికారులను బుధవారం టీఎన్‌జీఓ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ నాగిళ్ల మురళి, ప్రధాన కార్యదర్శి జి.శేఖర్‌రెడ్డి, వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రణదీవె, కార్యదర్శి సత్యనారాయణ, టీఎన్‌జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు పి.గామయ్య పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

కట్టంగూర్, ఏప్రిల్ 30 : మండలంలోని అయిటిపాముల, కట్టంగూర్ పీఏసీఎస్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం తాసీల్దార్ గుగులోతు ప్రసాద్ సందర్శించారు. అధికారులు, రైతులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించి వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. ధాన్యం త్వరగా దిగుమతి అయ్యేలా చర్యలు తీసుకొని లారీల కొరత లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.

## బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

బీఆర్ఎస్ నాయకుడు ఫ్రాన్సిస్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్

శాలిగౌరారం, ఏప్రిల్ 30 : మండలంలోని వంగమర్తి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ కందుల అనిత తండ్రి, బీఆర్ఎస్ నాయకుడు తానం ఫ్రాన్సిస్‌రెడ్డి కాలికి గాయమై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బుధవారం గ్రామానికి వెళ్లి ఫ్రాన్సిస్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్, నాయకులు కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుండా శ్రీనివాస్, దుబ్బ వెంకన్న, మామిడి రమేశ్, అంతిరెడ్డి, బస్వ రాజు, పొడిచేటి గోపి ఉన్నారు.

## మూగజీవాలకు మెరుగైన వైద్యం అందిచాలి

- సంచార వైద్యశాల ప్రాజెక్ట్ మేనేజర్ భాగిష్ మిశ్ర

1962 వాహనం వద్ద సిబ్బందితో భాగిష్‌మిశ్ర

చండూరు, ఏప్రిల్ 30: మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించాలని సంచార వైద్యశాల స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ భాగిష్ మిశ్ర ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని సంచార పశువైద్యశాల వాహనాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువుల పెంపకం దారులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. మూగజీవాలకు కావల్సిన ఔషధాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ప్రోగ్రాం మేనేజర్ నసీరొద్దిన్, జిల్లా ఇన్‌చార్జి ఎల్లావుల మధు, డాక్టర్ మహిధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## ఉపాధిహామీ ఉద్యోగుల సమ్మె నోటీస్

సమ్మె నోటీసును ఇస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

దామరచర్ల, ఏప్రిల్ 30 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధిహామీ ఉద్యోగులు, వర్కర్లు బుధవారం ఎంపీడీఓ అలివేలుమంగకు సమ్మెనోటీస్‌ను అందించారు. ఈ సందర్భంగా ఏపీఓ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ తాము బుధవారం నుంచి పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. మండలంలో ఏపీఓ, ఈసీ, డీఏ, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డు అసిస్టెంట్లుకు నాలుగు నెలలుగా వేతనాలు రాక పోవడంతో అవస్థలు పడుతున్నామనీ తెలిపారు. పెన్ డౌన్ సమ్మెతో టేబుల్ వర్కు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆయిల్‌పామ్ తోట దగ్ధం

దగ్ధమైన ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి నసీమా

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 30: మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన ఓ రైతు మంగళవారం తన పొలంలో ఎండిన పత్తికట్టెను తగులబెట్టడంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న శంకర్‌రావుకు చెందిన ఆయిల్‌పామ్ తోట దగ్ధమైంది. తోటలోని 40 మొక్కలు, డ్రిప్ పైపులైన్లు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఉద్యానవన డివిజన్ అధికారి నసీమా బుధవారం దగ్ధమైన తోటను పరిశీలించి రైతుకు సూచనలు చేశారు. కాలిపోయిన మొక్కల చుట్టూ పాదులు చేయాలని, కలుపును, కాలిన ఎండుగడ్డిని తీసివేసి యాజమాన్య పద్ధతులు చేపట్టాలని సూచించారు. రెండు కిలోఉల బెల్లం, రెండు కిలోల యూరియాను 20 లీటర్ల నీటిలో కలిపి కాలిన మొక్కలపై పిచికారీ చేయాలన్నారు. ఆమె వెంట పతంజలి డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్ ఉన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై జంగ్ సైరన్

- టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్

సమావేశంలో మాట్లాడుతున్న మారుతీసాగర్ పక్కన సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్

నల్లగొండ రూరల్, ఏప్రిల్ 30: రాష్ట్రంలో గడిచిన ఏడాదిన్నర కాలంగా జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి ఉద్యమిస్తామని టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీసాగర్ అన్నారు. సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ అధ్యక్షతన బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల సమస్య నల్లగొండ జిల్లా కేంద్రంలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ సొంత జిల్లాలోనే ఇటువంటి పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కాల పరిమితి విషయంతో పాటు విధి విధానాల రూపకల్పనలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. అనంతరం టీయూడబ్ల్యూజే జిల్లా కొత్త కమిటీని ప్రకటించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఫహిమొద్దీన్, అధ్యక్షుడిగా గుండగోని జయశంకర్‌తో పాటు పూర్తి స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి యోగానంద్, తెంజూ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమణ కుమార్, జాతీయ కార్యవర్గ సభ్యుడు అవ్వారి భాస్కర్, ఎలక్ట్రానిక్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, జానయ్య, అల్లి మల్లిఖార్జున్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, మట్టయ్య, గిరి, నరసింహ, వెంకట్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రారంభం

ఆధునీకరించిన క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు,ఏప్రిల్ 30 : మండల కేంద్రంలో ఆధునీకరించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన సతీమణి లక్ష్మితో కలిసి ప్రారంభించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన క్యాంప్ కార్యాలయంలో అదనపు గదులు నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, చండూరు ఆర్డీఓ శ్రీదేవి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బైక్ దొంగల ముఠా అరెస్ట్

- 14 బైక్‌లు స్వాధీనం, ముగ్గురు నిందితులకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్‌చంద్రపవార్

నిందితులను చూపుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, ఏప్రిల్ 30 : ఖరీదైన బైక్‌లను ఎత్తుకెళ్తున్న ముఠాను బుధవారం అరెస్టు చేసి వారి నుంచి 14 బైక్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బుధవారం తెల్లవారు జామున వాడపల్లి ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాడపల్లి శివారులోని రాష్ట్ర సరిహద్దు వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించారు. రెండు బైక్‌లపై ముగ్గురు వ్యక్తులు మన రాష్ట్రం నుంచి గుంటూరు వైపు వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో మరింత లోతుగా విచారణ చేయగా తాము బైక్ దొంగతనాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా చిలుకలూరిపేట మండలం కావూరుకు చెందిన నలమాల ఎర్రబ్బాయ్ అలియాస్ లూథర్, ఇదే గ్రామానికి చెందిన గుంజి అంకమరావుగా, మరో వ్యక్తి పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన మట్టిపల్లి శ్రీకాంత్‌గా గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. వీరు ముగ్గురు కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవారు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు ముగ్గురు కలిసి ముఠాగా ఏర్పడి ప్రభుత్వ కార్యాలయాల వద్ద, హోటల్స్, వైన్స్‌ల వద్ద, రాత్రి వేళల్లో ఇండ్ల ముందు నిలిపి ఉంచిన బుల్లెట్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్, పల్సర్ లాంటి వాహనాలను లక్ష్యంగా ఎంచుకొని దొంగతనాలకు పాల్పడేవారు. లూథర్ పాత కీతో బైక్ లాక్ ఓపెన్ చేసి తీసుకెళ్లి తన స్నేహితులతో కలిసి తక్కువ ధరకు విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఇప్పటివరకు నల్లగొండ, దామరచర్ల, ఇబ్రహీంపట్నం, నార్కట్‌పల్లి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మార్టురు, పొన్నూరు, రాజమండ్రి వంటి పట్టణాల్లో వీరిపై 13 కేసులు నమోదైనట్లు తెలిపారు. వీరు ముగ్గురు గతంలో 66 బైక్‌లు దొంగిలించగా.. తాజాగా ఇప్పటివరకు 36 బైక్‌లను దొంగిలించారని, అందులో 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని, మిగతా వాటిని సైతం త్వరలో స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. నిందితులను పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించి రివార్డులు ప్రకటించారు. సమావేవంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీసీఎస్ సీఐ డానియల్‌కుమార్, మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

## ప్రజా జీవితాలతో ఆటలాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

కార్యక్రమంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

గట్టుప్పల్, ఏప్రిల్ 30 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నాయని, హామీల అమలులో అవి విఫలం చెందాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్ల